

జిల్లాలో భారీ వర్షం

- పొంగిపొర్లిన వాగులు, వంకలు

ప్రజాశక్తి-విలేకరులు

జిల్లా వ్యాప్తంగా గురువారం తెల్లవారుజామున మోస్తరు వర్షం కురిసింది. కర్నూలు నగరంలోని వక్కెర వాగు ఉధృతంగా పారుతోంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. హాలహర్వి మండలంలో ఊరివంక ఉప్పొంగింది. హాలహర్వి, నిట్రవట్టి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మంత్రాలయం సమీపంలోని నాగలదిన్నె రోడ్డు ధరివంపు వంకకు నీటి ప్రవాహం పెరిగింది. ఇబ్రహీంపురం, కొట్టాల తదితర గ్రామాల నుంచి విద్యార్థులను తీసుకురావడానికి వెళ్తున్న ఆర్‌టిసి బస్సు వంకలో చిక్కుకుంది. అయితే ఎలాంటి ప్రమాదం సంభవించలేదు...

జిల్లా వ్యాప్తంగా గురువారం తెల్లవారుజామున 2 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ ఎడతెరపి లేని వాన కురిసింది. జిల్లావ్యాప్తంగా 23 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా గూడూరులో 99 మిల్లీమీటర్లు, అత్యల్పంగా గోనేగండ్లలో 2.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 29.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.



చిప్పగిరి మండలంలో పంట పొలాల్లో చేరిన వర్షపునీరు

చిప్పగిరిలో వర్షం దంచి కొట్టింది. గురువారం మండలంలో 68.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. మండలంలోని బెల్డోన గ్రామం పెట్రోల్ బంకు దగ్గర ఉన్న వాగు ఎన్నడూ లేనివిధంగా భారీ వరదతో పొంగి పొర్లింది. ఉదయం వరకు వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. సంగాల గ్రామంలో ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రం బయట ప్రాంతమంతా వరద నీరు చేరి విద్యార్థులు పోవడానికి కూడా లేకుండా భారీగా వరద నీరు నిలిచింది. విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. పొలాల్లో సాగు పైరంతా వరద నీటికి కొట్టుకుపోయినట్లు పలువురు రైతులు వాపోయారు. ఈ భారీ వర్షంతో పంటలు చాలా వరకు కుళ్లిపోతాయని కంది, పత్తి తదితర పంటలు వేసుకున్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రం చుట్టూ ఎత్తుగా గ్రావెల్ వేయించాలని సంగాల గ్రామస్తులు కోరుతున్నారు. **హాలహర్వి** మండలంలోని మేదేహాల్, కామినహాల్ గ్రామ శివారులోని వాగు వరద ఉధృతిని తహశీల్దార్ లక్ష్మీ నారాయణ పరిశీలించారు. రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులు నిండి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద ఉధృతి కారణంగా వాగు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. వాగు పక్కనే ఉన్న దాదాపు 2 వేల ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. వరి, మిరప, జొన్న పంటలు నీట మునిగాయని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేస్తామని తహశీల్దార్ హామీఇచ్చారు. **మంత్రాలయం**లో కురిసిన భారీ వర్షాలకు స్థానిక కాలనీలు జలమయమయ్యాయి. రామచంద్ర నగర్ కాలనీలో ఉన్న టవర్ ఏరియా కాలనీలో సరైన రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్న వారికి వర్షపు నీరు మరింత ఇబ్బందులకు గురి చేసింది. సుమారు 50 ఇళ్లకు పైగా ఉన్న ఈ కాలనీ వాసుల రోడ్లలో మోకాలి లోతు వరకు నీరు చేరడంతో పాటు ఇళ్లలోకి నీరు చేరాయి. ఎప్పుడు వర్షం కురిసినా ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నామని, నీరు వెళ్లిన తర్వాత బురదమయమైన రోడ్డు అధ్వానంగా ఉంటుందని, వృద్ధులు, పిల్లలు కింద పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే నాగలదిన్నె రహదారిలో ఉన్న దరువంపు వాగులో ఆర్‌టిసి బస్సు చిక్కుకొని ఒక ప్రయాణికుడితో పాటు బస్సు డ్రైవర్, కండక్టర్ ప్రాణాలతో క్షేమంగా బయటపడ్డారు. మంత్రాలయం నుంచి నదీ కైరవాడి, కొట్టాల ఇబ్రహీంపురం, మాచాపురం గ్రామాల మీదుగా విద్యార్థుల కోసం నందవరం మీదుగా ఎమ్మిగనూరు వెళ్లేందుకు బయల్దేరారు. మంత్రాలయం సమీపంలో ఉన్న దరువంపు వాగు ఉదయం నుంచి కురిసిన భారీ వర్షానికి ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగులో నీటి ప్రవాహం తక్కువగా ఉందని, వెళ్లిపోవచ్చని డ్రైవర్ రాయుడు, కండక్టర్ బజారమ్మ ఉన్న ప్రయాణికుడితో వాగు దాటేందుకు ప్రయత్నించారు. మధ్యలోకి వెళ్లగానే ప్రవాహం పెరగడంతో భయపడి బస్సును ఆపేసి నీటి నుంచి ముగ్గురు బయటపడి ప్రాణాలు దక్కించుకున్నారు. అధికారులకు తెలుపగా వాగు ఉధృతి తగ్గిన తర్వాత బస్సును తరలించారు. **గూడూరు** మండలంలో భారీగా వర్షాలు కురిశాయి. మండలంలోని పెంచికలపాడు గ్రామంలో ఉన్న వక్కెరవాగు వద్ద వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. గూడూరు గ్రామంలో సింగనగిరికి చెందిన వంక రావడంతో చుట్టుపక్కల ఉన్న ఇళ్లలోకి నీరు పోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

టమోటా ధర పతనం..!

• మార్కెట్‌లో కిలో రూ.2 , బహిరంగం మార్కెట్లో రూ.20 • గిట్టుబాటు కాదంటూ రైతులు ఆందోళన

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ వ్యవసాయ మార్కెట్ లో రోజు రోజుకు టమోటా ధర పూర్తిగా పతనం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగుచేసిన పంట చేతికొచ్చే సమయానికి ధర లేకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. గత పది రోజుల కిందట ఆశాజనకంగా టమోటా ధర పలకడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. మార్కెట్‌కు గురువారం రోజు సుమారు 250 క్వింటాళ్లు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో వ్యాపారస్తులు ప్రజలకు కిలో టమోటా రూ.20 అమ్ముతున్నారు. టమోటా మార్కెట్లో కిలో రూ.2 నుంచి రూ.5 లోపే వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రూ.10 గిట్టుబాటు ధర కూడా లభించడం లేదంటూ రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. వ్యాపారస్తులు రైతులను నట్టేట ముంచుతూ ఇష్టానుసారంగా కొనుగోలు చేయడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. జతబాక్స్ 50 కిలో రూ.60, రూ.80 మించకుండా కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. కోత కోసి మార్కెట్ తెచ్చిన రవాణా చార్జీలు కూడా రావడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరా టమోటా పంట సాగు చేయడానికి సుమారు రూ.60 వేల వరకు పెట్టుబడి ఖర్చు వస్తుంది. రాబోయే రోజుల్లో మార్కెట్లో ధరలు పతనమైతే సాగుచేసిన పంటలకు అప్పులు కూడా తీర్చలేమంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు.

ధర పతన కావడానికి కారణాలు

వ్యాపారస్తులు టమోటా కొనుగోలు చేసి హైదరాబాద్, మహారాష్ట్ర ,వరంగల్, అదిలాబాద్ , రంగారెడ్డి ,తమిళనాడు మహానగరాలకు సరఫరా చేస్తున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సరుకు అమ్ముడు పోవడం లేదంటూ వ్యాపారస్తులు అంటున్నారు. టమోటా పంట వర్షానికి తడవడంతో టమోటాలు నాణ్యత పూర్తిగా దెబ్బతింటుందంటున్నారు. ధరలు లేనప్పుడు టమోటా కొనుగోలు చేస్తే తీవ్రంగా నష్టపోతామంటూ వ్యాపారులు తెలిపారు. వర్షాలు, పండగలు వచ్చినప్పుడల్లా టమోటా ధర పతనమవుతుందని రైతులు చెబుతున్నారు. కనీసం గిట్టుబాటు ధరతోనైనా కొనుగోలు చేయాలని రైతుల కోరుతున్నారు.



మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన టమోటా

కూలి, రవాణా ఖర్చులు రావడం లేదు

- రైతు మన్సూర్, గిరిగేట్ల గ్రామం, తుగ్గలి మండలం



మూడు ఎకరాలలో టమోటా పంటను సాగు చేశాను. రెండో సారి కోత కోసి 8 బాక్సులు మార్కెట్ కు తీసుకొచ్చాను. 25 కిలో జత 50 కిలోలను రూ. 60కి వ్యాపారస్తులు కొనుగోలు చేశారు. కూలి రవాణా ఖర్చులు కూడా రావడం లేదు.

అప్పులు భరించాల్సిందే...

- రైతు ఖాజావలి, దూదేకొండ గ్రామం పత్తికొండ మండలం



32 గంపల టమోట మార్కెట్‌కు తీసుకొచ్చాను. జత గంపలు రూ.70కి వ్యాపారస్తు కొన్నారు. కనీసం గిట్టుబాటు ధరతో కూడా పలుకలేదు. పంట సాగు చేయడానికి పెట్టిన పెట్టుబడి అప్పుగా భరించాల్సిందే. ఎలా తీర్చాలి.

డ్రోన్ ఆధారిత పర్యవేక్షణ ఉపయోగం

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ట్రిపుల్ ఐడి డిఎం విద్యా సంస్థ రూపొందించిన డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థ ఉపయోగకరమని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని తన క్యాంప్ కార్యాలయంలో ట్రిపుల్ ఐటీ డిఎం ఆధ్వర్యంలో రూపొందుతున్న డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థకు సంబంధించిన ప్రదర్శనను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు ట్రిపుల్ ఐటి డిఎం ప్రొఫెసర్లు, విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ వ్యవస్థను రూపొందించడం పూర్తి అయిన నేపథ్యంలో ఒక గ్రామంలో డెమో ప్రదర్శన చేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రోగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని తక్షణ వైద్య సదుపాయం అందించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. వ్యవస్థను రూపొందిస్తున్న ట్రిపుల్ ఐటి డిఎం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ కె కృష్ణ నాయక్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, రాయలసీమ యూనివర్సిటీ విద్యార్థి ఖాసిఫా అంజుమ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రమత్తం కావాలి - ప్రమాదాలు జరగకుండా చర్యలు

జిల్లాలో అధికంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తం కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా కోరారు. గురువారం సబ్ కలెక్టర్ ఆర్డిఒలు తహసీల్దార్లు, ఎంపిడిఒలు, ఇరిగేషన్ అధికారులతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. గూడూరు, మద్దికెర, చిప్పగిరి, హాలహర్వి, నందవరం, పెద్ద కడుబూరు మండలాల్లో వర్షం అధికంగా కురిసిందన్నారు. సి.బెలగల్, గూడూరు, చిప్పగిరి మండలాల్లో వర్షం వచ్చే సూచనలు ఉన్నాయన్నారు. ఆయా మండలాల అధికారులు అప్రమత్తమై, ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్, డివిజన్, మండల హెడ్ క్వార్టర్లలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేసుకొని, పరిస్థితి నియంత్రణలో ఉండేలా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్, గాజులదిన్నె ప్రాజెక్టు కింద ఉన్న మండలాల ఇరిగేషన్ ఎఇలు, విఆర్ఒలు జాయింట్ టీమ్‌గా ఏర్పడి స్ట్రక్చర్లను తనిఖీ చేసి ఏమైనా మరమ్మతులు ఉంటే రిపోర్ట్ చేయాలన్నారు. వంకలు, వాగుల వద్ద, హంద్రీ నీవా కాలువలు ఉన్న మండలాల్లో నీటి ప్రవాహం అంశంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్డిఒలు సందీప్ కుమార్, భరత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టర్‌గా డాక్టర్ ఎ.సిరి

- ప్రస్తుత కలెక్టర్ రంజిత్ బాషా బదిలీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



జిల్లా నూతన కలెక్టర్‌గా డాక్టర్ అట్టడ సిరిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. ప్రస్తుత జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్న పి.రంజిత్ బాషాను ఇక్కడి నుండి బదిలీ చేశారు. రంజిత్‌బాషాకు మాత్రం ఎక్కడ పోస్టింగ్ కల్పించలేదు. ప్రస్తుత జిల్లా కలెక్టర్‌గా నియమితులైన డాక్టర్ అట్టడ సిరి ప్రస్తుతం వైద్య ఆరోగ్యశాఖలో సెక్రెటరీగా విధులను నిర్వహిస్తున్నారు. గతంలో అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్, ఉపాధి కల్పన శాఖ డైరెక్టర్ గా పనిచేశారు. మరో రెండు మూడు రోజుల్లో జిల్లా కలెక్టర్‌గా నియమితులైన డాక్టర్ ఎ.సిరి బాధ్యతలను చేపడతారని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

పల్లె నిద్రలో కర్నూలు పోలీసులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు సమస్యాత్మక గ్రామాల్లో జిల్లావ్యాప్తంగా రాత్రిబస (పల్లెనిద్ర) చేపడుతున్నారు. గ్రామస్తులతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల చర్యలు తీసుకుంటామని, ఎవరైనా గొడవలకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలకు జోలికెళ్లినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు, డబ్బులు ఇస్తే ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పే దళారుల మాటలు నమ్మకూడదని, మహిళలు, బాలబాలికలపై జరిగే నేరాల గురించి, సైబర్ మోసాల బారిన పడకూడదని, అపరిచితుల కాల్స్ , లింకులు క్లిక్ చేయరాదని, బ్యాంకు ఖాతాల ఓటిపిలు ఎవరికి చెప్పకూడదని ప్రజలకు అవగాహన చేస్తున్నారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే 1930 కి కాల్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన చేస్తున్నారు. ద్విచక్ర వాహనం నడిపే సమయంలో ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అవగాహన కల్పిస్తున్నారు. వాహనాలు నడిపే సమయంలో మీపై మీ కుటుంబ సభ్యులు ఆధారపడి ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకుని రోడ్డు భద్రతా నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ప్రజలకు అవగాహన చేస్తున్నారు. గ్రామాలలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూసుకునే భాధ్యత పోలీసు అధికారులకు ఉంటుందని, అందుకోసం గ్రామాలలోని ప్రజలు తమ వంతు భాధ్యతగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు గ్రామాలలోని యువత, ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా మీ కుటుంబాలకు తోడుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమాలలో గ్రామాలలోని ప్రజలు యువత, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



జోహరాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

15న చలో విజయవాడ

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు కోసం ఈ నెల 15న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చెయాలరని భవన నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు)నగర అధ్యక్షులు నాగరాజు డిమాండ్ చేశారు. ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమబోర్డు పునరుద్దరణ చెయ్యాలని భవన నిర్మాణ సంఘం నాయకులు మద్దిలేటి అధ్యక్షతన జోహారాపురంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. నాగరాజు, సిఐటియు నాయకులు రంగస్వామి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు కోసం కార్మికులందరు కలిసికట్టుగా పోరాటం చేయాలన్నారు. ఈ నెల 15 జరిగే చలో విజయవాడ విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మధు, సుధాకర్, తిప్పన్న, మౌలాలి, బహదూర్, మద్దిలేటి, లక్ష్మన్న, రవి, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

'అశోక'లో ఒరియంటేషన్

బి.టెక్ విద్యార్థులకు స్వాగతం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



మాట్లాడుతున్న కె.వెంకటేశ్వర్‌రెడ్డి

అశోక మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. టెక్‌మహీంద్రా వైస్ ప్రెసిడెంట్ కె వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సాంకేతిక అభివృద్ధులు విశ్వంతో ముడిపడి ఉన్నాయని, వాటిని అర్థం చేసుకుంటూ అపరిమిత లక్ష్యాలు పెట్టుకోవాలని కొత్త ఆవిష్కరణలు, సృజనాత్మకత, జీవితాంతం నేర్చుకునే అలవాటు అలవరచుకోవాలని సూచించారు. నూతన అశోకైట్స్ తమ భవిష్యత్తు విజయాన్ని సాధించాలంటే క్రమశిక్షణ, నిబద్ధత, నైపుణ్యాల మెరుగుదల అనివార్యమని చెప్పారు. విద్యార్థులకు కెరీర్ మార్గదర్శనం చేశారు. బలమైన పునాదులు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, అనుకూలత, జట్టు పని ప్రాముఖ్యతను వివరించారు. టెక్నాలజీ వేగంగా మారుతున్నా, నిరంతర అధ్యయనం, సమస్యల పరిష్కార నైపుణ్యం విద్యార్థులను దీర్ఘకాలంలో విజయవంతులను చేస్తుందని అన్నారు. కళాశాల మేనేజ్‌మెంట్, వైస్ ప్రిన్సిపల్స్, విభాగాధిపతులు కళాశాల, అభివృద్ధి ప్రయాణం, ఆధునిక బోధన విధానాలు, బలమైన శిక్షణ ప్లేస్‌మెంట్ సహకారం గురించి వివరించారు. నాలుగేళ్ల ఇంజనీరింగ్ విద్యా ప్రయాణం వారికి ఒక రూపాంతరాత్మక అనుభవంగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా ఉడాన్ 2025 కేవలం ఒక ఒరియంటేషన్ మాత్రమే కాదు, విద్యార్థుల కలలు, ఆశయాలకు ఆరంభ వేదిక" అని నిర్వాహకులు తెలిపారు.

కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షకు ఏర్పాట్లు

తొలి దశలోనే గుర్తిస్తే వ్యాధిని నియంత్రించవచ్చు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలోని స్టేట్ కేన్సర్ ఆసుపత్రిలో గురువారం అసంక్రమిక వ్యాధుల ఎన్‌సిడి 4 కేన్సర్ వ్యాధిపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే సామాజిక అధికారులకు , పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమములో డాక్టర్ నాగరాజు నోటి కేన్సర్, గర్భాశయ ముఖద్వారా కేన్సర్, రొమ్ముకేన్సర్ స్క్రీనింగ్ పై పవర్ పాయింట్ ప్రసెంటేషన్ ద్వారా శిక్షణ అందించారు. క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడం వలన ఈ వ్యాధిబారిన పడకుండా జాగ్రత్త పడవచ్చునని అన్నారు. క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే ఈ వ్యాధిని నియంత్రించవచ్చని అన్నారు. అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ మహేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలందరికీ ముందస్తు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలోనే సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే వ్యాధి తీవ్రత కాకుండా ఉంటుందన్నారు. మూడు రకాల క్యాన్సర్లను వైద్య తనిఖీలు, పరీక్షలతో అనుమానిత లక్షణాలను వైద్య సిబ్బంది ఎలా గుర్తించాలి ,తదుపరి కార్యచరణపై శిక్షణలో వివరించిన అంశాల్ని సిబ్బంది క్షేత్ర స్థాయిలో పక్కగా అమలు జరిపి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేయాలని తెలిపారు. క్యాన్సర్ పట్ల చిన్నపాటి లక్షణాలు కనిపించినా వెంటనే స్క్రీనింగ్ చేయాలని తెలిపారు. కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రికి ప్రతి మంగళవారం, గురువారం ఒపి నెంబర్ 222కు రెఫర్ చేయాలని తెలిపారు. వైద్యులు వెంకటసుబ్బ నాగరాజు, డాక్టర్, సాహితి జయరామ్, డాక్టర్‌విజయభాస్కర్, డెంటల్ డాక్టర్ హడస్సా, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, ఆర్‌కెఎస్‌కె కన్సల్టెంట్ మల్లికార్జున, ఫైనాన్స్ కన్సల్టెంట్ అరుణ , ప్రాజెక్టనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.



కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మహేశ్వర ప్రసాద్

వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : నేటితరం యువత వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలని రామకృష్ణ మిషన్ నెల్లూరు కార్యదర్శి స్వామీ హ్రిదానందజీ అన్నారు. గురువారం కర్నూలు నగర శివారులోని స్థానిక ట్రిపుల్ ఐటి డిఎం విద్యాసంస్థలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వివేకానందుని రచనలను అధ్యయనం చేయాలని కోరారు. తీరిక సమయంలో వివేకానందుని సందేశాలను వినాలని పేర్కొన్నారు. రామకష్ణ మిషన్ కర్నూలు జిల్లా కార్యదర్శి శరత్‌చంద్రతో పాటు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మాదిగ కార్పొరేషన్ చైర్మన్ రాక

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి శుక్రవారం కర్నూలులో పర్యటించనున్నారు. కర్నూలు నగరంలోని సంక్షేమభవన్‌లో కార్పొరేషన్ ఇడి కార్యాలయంలో అక్కడ అధికారులతో ఆమె సమావేశం అవుతారు. అనంతరం కర్నూలు నగరంలోని ఎస్‌సి కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్ సముదాయాన్ని పరశీలిస్తారు.

మందు బాబులకు నిలయంగా పార్కు

-పట్టించుకోని పాలకమండలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని పాతబస్తీలోని జామియామసీద్ (వాసవి కాలేజ్ ముందర) వద్ద గల పార్కు మందు బాబులకు నిలయంగా మారిందని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్‌ఎండిషరీఫ్, డి. అబ్దుల్ దేశాయ్, సీనియర్ నాయకులు డి.పార్వతయ్య నగర కమిటీ సభ్యులు ఎస్‌డి. ఖాజా పాషా, గౌస్, హర్షద్ లు ఘాటుగా విమర్శించారు. ఇక్కడ వాసవి కళాశాల , ముస్లింలు ప్రార్థించే మర్కజ్ పెద్ద మసీదు ముందు ఈ పార్కులో మందుబాబులు వస్తున్నారంటే మునిసిపల్ అధికారులు ఏం చేస్తున్నట్లు అని వారు ప్రశ్నించారు. నగరపాలక సంస్థ అధికారులు, పాలకమండలి ప్రజా ప్రతినిధులు ,కార్పొరేషన్ కమిషనర్ వారికి ఈ పార్కు పట్ల ఏం మాత్రం చిత్తశుద్ధి లేదన్నారు.

పాత బస్తీ లో ఉన్న ఏకైక పార్కు అయినట్టు ఈ పార్కులో ఇక్కడి ప్రజలు వాకింగుకు వచ్చేవారని నేడు ఎక్కడ చూసినా మద్యం సీసాలు, వాటర్ పాకెట్లు గ్లాసులు ఉన్నాయన్నారు. నగర ప్రజల నుండి ముక్కు పిండి మరి పన్నులు వసూలు చేస్తున్న పాలకమండలికి నగర కమిషనర్‌కు , ప్రజాప్రతినిధులకు ఈ పార్క్ పట్ల చిత్తశుద్ధి లేదని, ఈ పార్కును అభివృద్ధి చేయాల్సిన బాధ్యత లేదా అని వారు ప్రశ్నించారు. ఈ పార్కులో ఏర్పాటు చేసిన పరికరాలని కూడా ఎక్కడికక్కడ విరిగి చెల్లా చదరుగా పడి ఉన్నాయన్నారు. వ్యాయమం కోసం రూ.లక్షల ఖర్చుపెట్టి తెచ్చిన ఏ పరికరం ప్రజలకు ఉపయోగ కరంగా లేకుండా పో యిందని ,ప్రజాధనాన్ని మట్టి పాలు చేశారని వారు ఆరోపించారు. తక్షణమే నగర పాలక సంస్థ కమిషనర్ పర్యటించి అక్కడి అపరిశుభ్రత వాతావరణాన్ని పరిశీలించాలన్నారు.





-పాడయిన క్రీడా పరికరాలు, మందు బాబులు తాగిపాడేసిన బాటిళ్లు , తదితరాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న చేనేత కార్మిక సంఘం నేతలు

14న ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి -కోడుమూరు

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం కర్నూలు జిల్లా జిల్లా 8వ నాగలదిన్నె గ్రామంలో ఈనెల 14న ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని ఆసంఘం జిల్లా కార్యదర్శి కామర్తిరాజు, జిల్లా అధ్యఅధ్యక్షుడు లక్ష్మన తెలిపారు. ఈ సందర్భంగా గురువారం మహాసభ కరపత్రాన్ని విడుదల చేశారు. రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు హాజరవుతారని కర్నూలు జిల్లాలోని చేనేత కార్మికులు పాల్గొనాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు జిపి. వీరన్న,బి.తాయప్ప, కె.శంకర్, బి బాబు పాల్గొన్నారు.

విద్యుత్ తీగల సమస్య పరిష్కారం

- సర్పంచి మాధవస్వామి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు తీగల సమస్య తొలగిపోయిందని అందుకు కృషి చేసిన అధికారులకు దిన్నదేవరపాడు గ్రామ సర్పంచి మీసాల మాధవస్వామి ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో గ్రామ సచివాలయం నుంచి మారెమ్మ గుడి వరకు విద్యుత్ తీగలు అత్యంత ప్రమాదకరంగా మారి ఉండే ఉన్నారు. ప్రజలు అటువైపు తిరగాలంటే భయం భయంగా ఉండేది అన్నారు. దీనిపై పలుమార్లు మండల సర్వసభ్య సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. ఈ మేరకు స్పందించిన అధికారులు కొత్త ఫోన్స్‌ను ఏర్పాటు చేసి ఇబ్బంది లేకుండా సమస్యను పరిష్కరించారన్నారు

15న అంగన్‌వాడీల జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



ఎపి.అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) జిల్లా 10 వ మహా సభలను జయప్రదం చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షురాలు పి.నిర్మల, అధ్యక్షురాలు కె.వెంకటమ్మ కోరారు. గురువారంకర్నూలు కార్మిక కర్షక భవన్లో యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 15న కర్నూలులో మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలపై పోరాటాలు చేస్తున్నా గత జగన్ ప్రభుత్వం,ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా హామీలు యిచ్చారు. ఏరు దాటే వరకు ఓడ మల్లన్న ఏరు దాటిన తరువాత బోడి మల్లన్న అన్న చందంగా వాటినీ పట్టించుకునే నాధుడే లేడన్నారు. గత ప్రభుత్వంలో దాదాపు 42 రో జులు సమ్మె చేసినా ఆ ఉద్యమాన్ని అణచాడానికి జగన్ ఎస్మా లాంటి చట్టాన్ని ప్రయోగించడానికి సిద్ధపడ్డారు. సమస్యలు పరిష్కారించలేదు. ఆ సమ్మె సంధర్భంగా ప్రస్తుత కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే సమస్యల పరిష్కారిస్తామని చేప్పారని, 15 నెల లయినా పట్టించుకోకుండా పని భారం పెంచారన్నారు.

తగిన జాగ్రత్తలతో మద్దతు ధర పొందాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


ఉల్లి రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - గోనెగండ్ల

వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి.. తగిన జాగ్రత్తలతో ఉల్లి రైతులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. గురువారం మండలంలోని వెముగోడు గ్రామంలో ఉల్లి రైతులతో మాట్లాడారు. రైతుల నుంచి పంట సాగు, ఉత్పత్తి, అమ్మకాలపై ఆరా తీశారు. ఉల్లి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంటకాలం పూర్తయిన వాటినే కోత కోయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉల్లికి కిలోకు రూ.12 మద్దతు ధర అందిస్తోందని చెప్పారు. నాణ్యమైన ఉల్లి అయితే రూ.12 కంటే ఎక్కువ ధర లభించే అవకాశం ఉందని సూచించారు. పచ్చిగా ఉన్న, గ్రేడింగ్ చేయని ఉల్లిని దూరప్రాంతాలకు రవాణా చేసేలోపు చెడిపోతుందని తెలిపారు. శని, ఆదివారాలు కర్నూలు మార్కెట్ యార్డు సెలవు ఉంటున్నందున ప్రత్యామ్నాయంగా తాడేపల్లిగూడెంలో కూడా ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందని సూచించారు. రైతులు తప్పనిసరిగా ఉల్లిని ఆరబెట్టి గ్రేడింగ్ చేసి మార్కెట్‌కు తీసుకు రావాలని కోరారు. తహశీల్దార్ పి.రాజేశ్వరి, ఎఒ హేమలత, ఉద్యానవన అధికారి శ్రీవాణి, గ్రామ వ్యవసాయ సహాయకులు రఘు యాదవ్ పాల్గొన్నారు.

భవనానికి మరమ్మతులు చేయించాలి

- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు



నిరసన చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి-ఆలూరు

ఐటిఐ తాత్కాలిక పురాతన భవనానికి మరమ్మతులు చేయించాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు కోరారు. గురువారం ప్రభుత్వ ఐటిఐ కళాశాల విద్యార్థులతో కళాశాల ముందు నిరసన చేపట్టారు. మండల అధ్యక్షులు బసవరాజ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మైనా, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడారు. ఆలూరులో ప్రభుత్వ ఐటిఐ కళాశాల 2008లో డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రిషన్, మెకానిక్ డీజిల్, కంప్యూటర్ ఆపరేటర్, ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, వెల్డర్, డ్రెస్ మేకింగ్ వంటి ట్రేడ్లు ఏర్పాటు చేశారన్నారు. సొంత భవనాల్లేక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల-1లో కొన్ని గదులను ఐటిఐ కళాశాలకు కేటాయించారని, ఈ భవనంలోనే నేటి వరకు ఐటిఐ కళాశాల కొనసాగుతోందని చెప్పారు. పురాతన భవనాలు కావడంతో భయం గుప్పెట్లో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. చిన్నపాటి వర్షం కురిసినా తరగతి గదుల్లో వర్షపు నీరు చేరి చిత్తడిగా మారి విద్యార్థులు కూర్చోవడానికి కూడా లేని దుస్థితి ఏర్పడుతోందని చెప్పారు. ప్రమాదకరంగా ఉన్న ఐటిఐ కళాశాల పురాతన భవనానికి మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శులు సురేష్, వర్మ, శ్రీరామ్, మండల నాయకులు ఆష్టఫ్, సుధాకర్, డాకి నాయక్, లోక నాయక్ పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ

ప్రజాశక్తి- దేవనకొండ

అంగన్వాడి కార్యకర్తలు ఐక్యంగా ఉద్యమించినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ తెలిపారు. గురువారం దేవనకొండలో అంగన్వాడీ వర్కర్స్ మండల మహాసభ జ్యోతి లక్ష్మీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటమ్మ, సిఐటియు మండల కార్యదర్శి అశోక్ మాట్లాడారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఒకమాట, అధికారం లేనప్పుడు ఒక మాట చెబుతున్నాయని తెలిపారు. కార్యకర్తలు లక్ష్మీ, సరోజ, వెంకటమ్మ, రంగమ్మ, సావిత్రి పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక : మండల అధ్యక్షులుగా మాబున్నీ, కార్యదర్శిగా ఎర్రమ్మ, ఉపాధ్యక్షులుగా భార్గవి, సహాయ కార్యదర్శిగా గంగమ్మ, లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


మాట్లాడుతున్న అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు

నిండుకుండలా 'గాజులదిన్నె'

- ఏ క్షణమైనా గేట్లు ఎత్తే అవకాశం

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని గాజులదిన్నె (సంజీవయ్య సాగర్) ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. అల్పపీడన ప్రభావంతో గత కొద్ది రోజులుగా హంద్రీనది ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు భారీగా నీరు చేరి నిండుకుండలా మారి తొణికిసలాడుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 4.5 టిఎంసిలు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం 3.8 టిఎంసిలు ఉంది. ఏ క్షణమైనా గేట్లు నీటిని దిగువకు వదిలే పరిస్థితులు ఉన్నాయి.


గాజులదిన్నె ప్రాజెక్టు నీటిమట్టం

గాజులదిన్నె ప్రాజెక్టుకు ముఖ్య ఆధారమైన హంద్రీనది పైప్రాంతాలైన మద్దికెర, పత్తికొండ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ప్రాజెక్టులోకి ఇంకా నీరు చేరే అవకాశం ఉందని ప్రాజెక్టు డిఇ సుబ్బరాయుడు తెలిపారు. నీటి ప్రవాహం ఇలాగే కొనసాగి గరిష్ట మట్టానికి చేరితే ఏ క్షణమైనా గేట్లు ఎత్తే అవకాశం ఉంది. అందుకనుగుణంగా గేట్లను సంసిద్ధం చేసుకున్నామని డిఇ తెలిపారు. ప్రాజెక్టు 6 గేట్లలో నాలుగు గేట్లు తెరిచేందుకు పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉన్నాయని, 1, 2వ నెంబరు గేట్లు కూడా అవసరాన్ని బట్టి ఒక మీటర్ వరకు ఎత్తుకునే అవకాశాలు ఉన్నాయని వివరించారు.

హంద్రీ పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- తహశీల్దార్ పి.రాజేశ్వరి



గాజులదిన్నె ప్రాజెక్టులో ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాల వల్ల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం చేరింది. నీటిమట్టం ఇంకాస్త పెరిగితే ఏ క్షణమైనా నీటిని విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. గాజులదిన్నె ప్రాజెక్టు దిగువ గ్రామాలైన గాజులదిన్నె, హెచ్.కైరవాడి, పుట్టపాశం, వెముగోడు, తిప్పనూరు గ్రామాలతో పాటు హంద్రీ నది పరివాహక ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి. పొలాల్లో ఏవైనా పంటలుంటే జాగ్రత్తగా ఇళ్లకు చేర్చుకోవాలి. వీలైనంత వరకు పొలాలకు వెళ్లకుండా ఉండడం మంచిది. ఈనెల 14 వరకు వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ సమాచారం. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిస్తే గంజిహళ్లి మల్లెల వాగుకు కూడా నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉంది. ఈ నాలుగు రోజులు పొలాల పనులు వాయిదా వేసుకుని రైతులు, ప్రజలు సురక్షితంగా ఉండాలి.

ఏ క్షణమైనా గేట్లు ఎత్తే అవకాశం

- సుబ్బరాయుడు, ప్రాజెక్టు డిఇ



గాజులదిన్నె ప్రాజెక్టులో ప్రస్తుతం 3.8 టిఎంసిల నీరు ఉంది. ఈ నీటిమట్టం పెరిగితే వెంటనే గేట్లు ఎత్తే అవకాశం ఉంది. అలారుదిన్నె బ్రిడ్జి వద్ద 6 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తున్నట్లుగా సమాచారం. కేవలం ఈ 6 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహమయితే ఇప్పటికి గేట్లు ఎత్తే అవకాశం లేదు. ఎగువ ప్రాంతాల్లో వర్షం కురిసి దీనికి అదనంగా మరింత నీటి ప్రవాహం ప్రాజెక్టులోకి వస్తే మాత్రం ఏ క్షణమైనా గేట్లు ఎత్తి నీటిని వదిలే అవకాశం ఉంది. ప్రాజెక్టు దిగువన ఉండే గ్రామాల ప్రజలు, హంద్రీ నది పరివాహక ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలి. తగిన జాగ్రత్తలు తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులకు సూచించాం.

వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం : ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి ఆదేశించారు. గురువారం ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్, మూడు మండలాల ఎంపిడిఒలు, వైద్యాధికారులు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ఈ వర్షాకాలంలో పట్టణంలో డ్రెయినేజీ, తాగునీటి సమస్యలు పరిష్కరించడంతో పాటు పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని హెల్త్ కేర్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు, డెంగీ వంటి వ్యాధుల నివారణ, వ్యాధుల నియంత్రణ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

'ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేస్తాం'

ప్రజాశక్తి - ఆదోని

కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా ఎమ్మెల్యే పార్థసారథి వైసిపి నాయకులను పక్కన పెట్టుకొని మాట్లాడడం సబబు కాదని టిడిపి నాయకులు శ్రీకాంత్ చౌదరి, రంగన్న తెలిపారు. గురువారం వారు మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు మేరకే ఇసుక పంపిణీ చేస్తున్నామని, పొంతన లేని ఆరోపణలను ఎమ్మెల్యే మానుకోవాలని తెలిపారు. ఆదోనిలో అన్నింటికీ పచ్చ జెండా ఊపి తమపై బురద జల్లడం సబబు కాదన్నారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

సురక్షితంగా చేరుకున్న ఆదోని వాసులు

ప్రజాశక్తి - ఆదోని

నేపాల్ దేశానికి విహార యాత్రకు వెళ్లిన ఆదోని వాసులు సురక్షితంగా బయటపడ్డారు. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాశీ పుణ్యక్షేత్రం దర్శనం కోసం వెళ్లారని గురువారం బంధువులు తెలిపారు. బంధువుల వివరాల మేరకు... బంగారం వ్యాపారం చేసే బసవరాజ్ శెట్టి, అనిత దంపతులు గత పది రోజుల క్రితం బంధువులు, స్నేహితులతో కలిసి నేపాల్ దేశంలోని ఆయా దేవాలయాలను సందర్శించుకుని రెండు రోజుల క్రితం కాట్మండుకు వెళ్లారు. అక్కడ చోటు చేసుకున్న విధ్వంస ఘటనకు భయపడి ప్రయివేట్ లాడ్జిలో దాక్కున్నారు. ప్రసార మాధ్యమాల ద్వారా విషయాన్ని మంత్రి లోకేష్‌కు విన్నవించుకున్నారు. మంత్రి చొరవతో 22 మంది ఇతర యాత్రికులతో కలిసి ఢిల్లీ చేరుకొని వారి ప్రాంతాలకు చేరుకున్నారు. ఆదోనిలోని ఎస్‌కెడి కాలనీకి చెందిన బసవరాజ్ శెట్టి, అనితలు కాశీ విశ్వేశ్వరుని దర్శనం నిమిత్తం బీహార్ నుంచి వెళ్లారు. ప్రస్తుతం సురక్షితంగా ఉన్నట్లు బంధు వులు తెలిపారు. నేపాల్‌లో చోటు చేసుకు న్న పరిస్థితుల నుంచి ప్రాణాపాయం నుంచి బయటపడి క్షేమంగా దేశానికి చేరినందుకు.. సహకరించిన మంత్రి నారా లోకేష్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


బస్సులో ప్రయాణిస్తున్న బసవరాజ్ శెట్టి దంపతులు

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే బీవీ పరామర్శ

ప్రజాశక్తి - నందవరం

టిడిపి కుటుంబాలకు పార్టీ అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం ఆయన నందవరం గ్రామంలో పర్యటించారు. మండలంలో ఇటీవల చనిపోయిన టిడిపి కార్యకర్తల కుటుంబాలను ఆయన పరామర్శించారు. పూలచింత గ్రామం బండేగురు పీఠాధిపతి జయశంకర స్వామి కొద్ది రోజుల క్రితం మరణించారు. ఎమ్మెల్యే పూలచింత గ్రామాన్ని చేరుకొని పీఠాధిపతి సమాధికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారుడు బండేగురు స్వామిని, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. నందవరం గ్రామంలో కొద్దిరోజుల క్రితం మరణించిన టిడిపి కార్యకర్త రుశేంద్ర స్వామి నివాసానికి వెళ్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాముకాటుకు గురై చనిపోయిన టిడిపి కార్యకర్త రాజోలి ఆంజనేయుల కుటుంబాన్ని పరామర్శించారు. టిడిపి మండల నాయకులు, మాజీ జడ్‌పిటిసి, బీసీ సెల్ అధ్యక్షులు ముగతి ఈరన్న గౌడ్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాధవరావు దేశాయ్, టిడిపి మండల కన్వీనర్ ఖాసీంవలీ, వ్యవసాయ సహకార బ్యాంకు ఛైర్మన్ గోపాల్, పూలచింత బండే గురు స్వామి, టిడిపి మాజీ కన్వీనర్ చిన్న రాముడు, రైస్‌మిల్ నారాయణరెడ్డి, గ్రామ అధ్యక్షులు దేవల్ల భీమశేఖర్, నల్లంగి మల్లికార్జున, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మప్ప, వీరేష్, ఆదిశేషు పాల్గొన్నారు.


నందవరంలో పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీవీ

అర్చకునికి ఎమ్మెల్యే పరామర్శ

ఎమ్మిగనూరు : అయ్యప్ప స్వామి దేవాలయం అర్చకులుగా గతంలో పని చేసిన కరణం నాగభూషణంను ఎమ్మెల్యే డాక్టర్ జయనాగేశ్వర రెడ్డి పరామర్శించారు. టిడిపి అభిమాని, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ మాజీ డిఎల్‌ఓ కరణం గురు రాఘవేంద్రరావు స్వామి తండ్రి నాగభూషణం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బీవీ నాగభూషణం కుటుంబాన్ని పరామర్శించారు.


నాగభూషణంను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

నేటి నుంచి నల్లారెడ్డి స్వామి దశమి ఉత్సవాలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల మేజర్ పంచాయతీలో శ్రీచింతలముని నల్లారెడ్డి స్వామి దశమి ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. శుక్రవారం దశమి, శనివారం పారువేట, ఆదివారం ఆరాధన కార్యక్రమంతో ఉత్సవాలు ముగియనున్నట్లు ఆలయ పూజారులు గురువారం తెలిపారు. శ్రీచింతలముని నల్లారెడ్డి స్వామి దశమి ఉత్సవాలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో హాజరై దర్శించుకుంటారు.

ఉలిగయ్య మృతి పార్టీకి తీరని లోటు : సిపిఎం

ప్రజాశక్తి - కౌతాళం

సిపిఎం నాయకులు ఉలిగయ మృతి పార్టీకి తీరని లోటని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య తెలిపారు. గురువారం ఉలిగయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు బదినేహాల్ గ్రామానికి చేరుకుని ఉలిగయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. మట్టి ఖర్చుల నిమిత్తం సిపిఎం నుంచి ఆర్థిక సహాయం అందజేశారు. మల్లయ్య మాట్లాడుతూ... ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తి ఉలిగయ్య అని, పార్టీ పిలుపుమేరకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు.

అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు : తహశీల్దార్

ప్రజాశక్తి - హాలహర్వి

రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలతో సమీక్ష నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరొకరికి గాయాలు

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని కప్పట్రాళ్ల బస్ స్టేషన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. కరివేముల గ్రామానికి చెందిన తలారి పశువుల రోగన్న (61), ఆయన కుమారుడు వీర గోపాల్ సొంత ఆటోలో టమోటా పంట ఉత్పత్తులను కోడుమూరు మార్కెట్‌లో అమ్ముకొని తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. కప్పట్రాళ్ల గ్రామ బస్ స్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి పశువుల రోగన్న అక్కడికక్కడే మృతి చెందారు. మృతుని కుమారుడు వీరగోపాల్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులపై వివక్షత వద్దు

- హెల్త్ సెంటర్ వైద్యులు షేకున్ భాను

ప్రజాశక్తి - ఆదోని

క్షయవ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపవద్దని, జాగ్రత్తలు వివరించాలని అరుణజ్యోతి నగర్ హెల్త్ సెంటర్ డాక్టర్ షేకున్ భాను తెలిపారు. గురువారం రాంజల రోడ్డు ప్రాంతంలో టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య, ఆరోగ్య శాఖాధికారులు బాబు రాజు, సుబ్బమ్మ బాయి, ఎఎన్ఎం సుజత పాల్గొన్నారు.

సిడిపిఒను సస్పెండ్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-ఆలూరు


భువనేశ్వరిని పరామర్శిస్తున్న నాయకులు


ఆలూరు మండలం కురవళ్లి గ్రామ అంగన్వాడీ టీచర్‌ను వేధింపులకు గురి చేసి అస్వస్థకు కారణమైన ఆలూరు సిడిపిఒను సస్పెండ్ చేయాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ డిమాండ్ చేశారు. అస్వస్థతకు గురయిన అంగన్వాడీ టీచర్ భువనేశ్వరి ఇంటికి వెళ్లి గురువారం వెంకటమ్మ, సిఐటియు జిల్లా నాయకులు కెపి.నారాయణస్వామి, పి.హనుమంతు పరామర్శించారు. అస్వస్థతకు కారణమైన విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌ల వల్ల పని ఒత్తిడి పెరిగి తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని, దీనికి తోడు సిడిపిఒలు చిన్న చిన్న లోపాలను సాకుగా చూపి అంగన్వాడీ టీచర్లను వేధింపులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఆలూరు సిడిపిఒ మామూళ్ల మత్తులో అవినీతిలో కూరుకుపోయారని, మామూలు ఇస్తే సరే, లేకపోతే సెంటర్లకు వెళ్లి మామూలు వసూలు చేసే పరిస్థితి ఉందని చెప్పారు. అంగన్వాడీ టీచర్ భువనేశ్వరి విధుల పట్ల నిర్లక్ష్యం చేయడం లేదని, ప్రభుత్వం ఇచ్చే పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులూ లేవన్నారు. ఐసిడిఎస్ జిల్లా అధికారులు స్పందించి, సమగ్రమైన విచారణ జరిపి, భువనేశ్వరి అస్వస్థతకు కారణమైన సిడిపిఒ నరసమ్మను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల నాయకులు కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

సమస్యలు గుర్తించి పరిష్కరించాలి

- ప్రత్యేకాధికారి నాగమోహన్

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రామీణ ప్రాంతా ల్లో సమస్యలు గుర్తించి పరిష్కరించడానికి కృషి చేయాలని మండల అధికారులకు ప్రత్యే కాధికారి నాగమోహన్ సూచించారు. గురువారం నగర డోన పంచాయతీ లోని మజరా గ్రామమైన తిమ్మాపురంలో ఎంపిడిఒ అల్లా బకాష్, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, సర్పంచి మల్లమ్మ ఆధ్వర్యంలో 'పల్లెకు పోదాం' నిర్వహించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, చౌక దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం చుట్టూ ప్రహరీ తప్పనిసరిగా నిర్మించాలని, ఈ విషయం ఉన్నతాధికారులకు కూడా విన్నవిస్తానని తెలిపారు. అలాగే సిసి రోడ్లు నిర్మించినా ఇరువైపులా డ్రెయినేజీలు లేకపోవడంతో చెత్తాచెదారం చాలా ఎక్కువగా ఉందని, డ్రెయినేజీలు ఉంటేనే సిసి రోడ్లు వేసేలా కాంట్రాక్టుదారులను సర్పంచులు కోరాలని చెప్పారు. డిప్యూటీ ఎంపిడిఒ నాగరాజు, ఎంఇఒ సావిత్రమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మల్లికార్జునరెడ్డి, ఏపీవో జుబేర్ అహ్మద్, విఆర్‌ఒలు మల్లికార్జున, వన్నూరు, పంచాయతీ కార్యదర్శులు బాలన్న, జయరాం నాయక్, నాగేంద్ర, వైద్యాధికారి రామ్మోహన్ పాల్గొన్నారు.


'పల్లెకు పోదాం'లో పాల్గొన్న అధికారులు

భూమి కోసం గొడవ

- తహశీల్దార్ కార్యాలయంలో ఘటన

ప్రజాశక్తి - మంత్రాలయం


గొడవ పడుతున్న రైతులు

భూమి సమస్య పరిష్కారానికి వచ్చిన ఇరు వర్గాల రైతులు గురువారం తహశీల్దార్ కార్యాలయంలోనే గొడవకు దిగారు. మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన రంగన్న, గోవిందు, మల్లన్న, వీరనాగుడు, దస్తగిరి అనే రైతులకు సంబంధించిన భూమి వివరాలు ఆన్‌లైన్‌లో ఉన్నాయి. గత తొమ్మిది నెలల క్రితం జరిగిన రీసర్వే తర్వాత రంగన్న, వీరనాగుడు, అయ్యన్న, నర్సన్న, నర్సిరెడ్డి సర్వే నెంబర్ 256లో 1.50 సెంట్ల భూమి పొరపాటున వారి పేర్లతో ఉన్నతాధికారులకు రెవెన్యూ అధికారులు పంపారు. అప్పటి నుంచి సరి చేసుకునేందుకు కలెక్టర్, సబ్ కలెక్టర్ వద్దకు తిరిగినా ఫలితం లేదని తెలుసుకొని తహశీల్దార్ కె.రమాదేవికి చూపించారు. ఈ విషయంపై సీనియర్ అసిస్టెంట్ జయరామిరెడ్డికి, విఆర్‌ఒ ప్రభాకర్‌కు వివరించారు. విచారణ అనంతరం ఇరువురు సర్దుబాటు చేసుకోవాలని వారు సూచించారు. లేకపోతే సమస్యగానే మిగులుతుందని హెచ్చరించారు. తమ భూమిని ఇతరులకు ఎలా ఇస్తామని చెప్పుకుంటూ తహశీల్దార్ గది నుంచి బయటకు రాగానే కార్యాలయంలోనే ఒకరి పైఒకరు దూషించుకుంటూ పిడిగుద్దులతో దాడి చేసుకున్నారు. వారించినా గొడవ సద్దుమణగలేదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఇరువర్గాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ శివాంజల్ ఆదేశాల మేరకు ఇరువర్గాలపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మి నారాయణ తెలిపారు.

ప్రజల కోసం లోకేష్ తపన, కృషి అభినందనీయం

- ఎమ్మెల్సీ బీటీ.నాయుడు

ప్రజాశక్తి - ఆదోని



నేపాల్‌లో జరిగిన మారణహోమంలో చిక్కుకున్న తెలుగు ప్రజలను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావడంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ చూపించిన తపన, కృషి, మానవతా దృక్పథం అభినందనీయమని ఎమ్మెల్సీ బీటీ.నాయుడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. తెలుగు వారికి ఆపద అనగానే, ఆపదకే అడ్డుగా నిలిచి, ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా సహాయక చర్యలు చేపట్టిన లోకేష్ ఆదర్శనీయమన్నారు. అనంతపురం పర్యటనను రద్దు చేసి, ఉదయం హుటాహుటినా సచివాలయానికి చేరుకున్న లోకేష్, రియల్‌టైమ్ గవర్నెన్స్ సెంటర్‌ను వార్ రూమ్‌గా మార్చి సహాయక చర్యలను వేగవంతం చేశారని తెలిపారు. బాధితులతో స్వయంగా మాట్లాడి వారికి ధైర్యం చెప్పడం, లోకేష్ కోఆర్డినేటర్లతో సహా మ్యాప్ సిద్ధం చేయించడం, ఢిల్లీలోని ఎపి భవనంలో అత్యవసర హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయించడం, చిక్కుకున్న వారికి ఆహారం, నీరు, వసతి సదుపాయాలు కల్పించడం వంటి చర్యలన్నీ చేపట్టి బాసటగా నిలిచారని చెప్పారు. నేపాల్‌లో చిక్కుకున్న సుమారు 215 మంది తెలుగు ప్రజలను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావడంలో లోకేష్ కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ తెలుగు ప్రజలు ఇబ్బందులు పడినా వారికి అండగా నిలవడంలో టిడిపి ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, వైసిపి ఏ మాత్రం మానవతా దృక్పథం లేకుండా వ్యవహరించారని, కనీస స్పందన కూడా చూపలేదని విమర్శించారు. చివరి వ్యక్తి వరకు స్వస్థలాలకు తీసుకొచ్చే బాధ్యతను స్వయంగా తీసుకున్న లోకేష్ నిజమైన నాయకునిగా నిలిచారని కొనియాడారు.


నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సీతారాం ఏచూరికి ఘన నివాళి


ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ సిపిఎం కార్యాలయంలో గురువారం సీతారాం ఏచూరి మొదటి వర్ధంతి సందర్భంగా సిపిఎం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. సిపిఎం తెర్నేకల్ శాఖ కార్యదర్శి మహబూబ్ బాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్ మాట్లాడారు. విద్యార్థి ఉద్యమంతో రాజకీయాలు మొదలుపెట్టిన సీతారాం ఏచూరి దేశంలో అత్యంత కీలకమైన నాయకునిగా ప్రభావవంతమైన పాత్ర పోషించారని తెలిపారు. దేశంలో మతతత్వ, కార్పొరేట్ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించారని చెప్పారు. సిపిఎం నాయకులు బజారి, కెపి.రాముడు, పరమేష్, శ్రీరాములు, దొడ్డప్ప, సుధాకర్, రవీంద్ర, నాగేంద్ర, బడే సాబ్, నాగేష్, శాంతి రాజు, లక్ష్మి రెడ్డి పాల్గొన్నారు.

మహేందర్ రెడ్డికి సముచిత స్థానం : వైసిపి

ప్రజాశక్తి - కౌతాళం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి మంత్రాలయం, ఆదోని కార్యకర్తలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలోనే మహేందర్ రెడ్డికి సముచితమైన స్థానం కల్పించారని వైసిపి నాయకులు అత్రి తనయ గౌడ్, సభ్యులు కురువ వెంకటేష్, మల్లయ్య, వీరేష్, ఖాదర్ బాష, హుసేన్ పీరా, రాఘవయ్య తెలిపారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన మహేందర్ రెడ్డిని గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహేందర్ రెడ్డికి రాష్ట్ర కార్యదర్శి పదవి కట్టబెట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. అధికారంలో ఉండగా ఎవరైన పదవులు ఆశిస్తారని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏ పదవికైనా సిద్ధపడి పోరాడే పార్టీ వైసిపి అని తెలిపారు. మహేందర్ రెడ్డికి ఈ అవకాశం ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, మంత్రాలయం ఎమ్మెల్యే బాల నాగిరెడ్డికి, ఆదోని ఇన్‌ఛార్జీ సాయి ప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అత్రి గౌడ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.


మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నాటక రంగంలో నటరాజు.. మారుతి మోహన్

- వైసిపి యువ నాయకులు దాట్ల సుబ్బరాజు


ప్రజాశక్తి - కౌతాళం

నాటక రంగంలో నటరాజు.. మారుతి మోహన్ అని వైసిపి యువ నాయకులు దాట్ల సుబ్బరాజు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. నాటక రంగంలో విశేష సేవలు అందించినందుకు మారుతి మోహన్ ధర్మవరం రామకృష్ణ ఆచారి జాతీయ అవార్డు అందుకున్నారని తెలిపారు. మారుతి మోహన్‌కు వైసిపి నాయకుడు దాట్ల సుబ్బరాజు శాలువా, పూలమాల వేసి సన్మానించారు. వైసిపి నాయకులు గణపతి రాజు, డాక్టర్ ఆనంద్ రాజ్, అహ్మద్, ఉపేంద్ర గౌడ్, సత్య గౌడ్, రాము, మొద్దీన్, డ్రైవర్ లింగన్న, మూలేమాన్ నరసింహులు, సాయిబాబా, ఎన్‌టిఆర్ నగర్ ఆనంద్, మహ్మద్, ఎన్‌టిఆర్ నగర్ వీరేష్ పాల్గొన్నారు.

కనకదాసు విగ్రహం ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలి

- కురువ సంఘం నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


ఆదోనిలో మాట్లాడుతున్న నాయకులు

ఆలూరు తాలూకా మనేకుర్తి గ్రామంలో శ్రీభక్త కనకదాసు విగ్రహం ధ్వంసం చేసిన నిందితులను అరెస్టు చేయాలని ఎపి కురువ సంఘం యూత్ ఉపాధ్యక్షులు కె.పరమేష్, రాయలసీమ నవయుగ కురువ సంఘం అధ్యక్షులు హాలేమనే నాగరాజ్, ఉపాధ్యక్షులు జె.రామన్న కోరారు. గురువారం మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గుర్తు తెలియని దుండగులు కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేశారని, నిందితులను అరెస్టు చేసేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేయాలని కోరారు. కురువ సంఘం పెద్దహరివాణం అధ్యక్షులు బిపి.గర్జప్ప, లింగన్న, బీరప్ప, అనిల్ కుమార్, కె.నాగరాజ్ పాల్గొన్నారు. **ఆలూరు** మండలం మనేకుర్తి గ్రామంలో కనకదాసు విగ్రహానికి ధ్వంసం చేయడం హేయమైన చర్య అని మదాసి/మదారి కురువ సంఘం రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ మనేకుర్తి రాజశేఖర్, ఉప సర్పంచి చిన్న రంగన్న తెలిపారు. గ్రామంలో కొంతమంది పనిగట్టుకొని కులస్తుల మధ్య గొడవలు సృష్టించేందుకు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. గ్రామస్తులు నారాయణ, ఆంజనేయ, దేవేంద్ర, ఆగులూరి, అల్లప్ప పాల్గొన్నారు. **కోసిగిలో** కురువ సంఘం జిల్లా అధ్యక్షులు భాను ప్రకాష్ మాట్లాడారు. నిందితులను అరెస్టు చేయాలని కోరారు.


ఆలూరులో మాట్లాడుతున్న నాయకులు

సీజనల్ వ్యాధులపై సలహా కమిటీ సమీక్ష

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అడ్వైజరి కమిటీ జనరల్ మెడిసిన్, మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ, ఎస్‌పిఎం డిపార్టుమెంట్, విభాగధిపతులతో సీజనల్ వ్యాధులపై సమీక్ష నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలడాన్ని దృష్టిలో ఉంచుకుని అడ్వైజరీ కమిటీ ప్రతి వారం నివేదికతో పాటు వైద్యులతో ఆసుపత్రి పరిధిలో ఉన్న వైద్య సేవలు, సౌకర్యాలు, రోగుల భద్రత వంటి అంశాలను విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్, టైఫాయిడ్ వంటి వ్యాధులు ఎక్కువగా వస్తున్నందున ఆసుపత్రికి వచ్చే ప్రతి పేషెంట్‌కు సమయానికి పరీక్షలు చేసి, తక్షణ చికిత్స అందించాలని సూచించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాలు పరస్పరం సమన్వయం చేసుకోవాలని, పేషెంట్ల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆయన వైద్య సిబ్బందిని ఆదేశించారు.

సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాలు:

ఎమర్జెన్సీ డిపార్ట్మెంట్, మెడిసిన్, పీడియాట్రిక్స్ విభాగాలు అత్యవసర సేవలు వేగవంతంగా అందించాలని అన్నారు. మైక్రోబయాలజీ, బయో కెమిస్ట్రీ, రేడియాలజీ ల్యాబ్స్ తక్షణ పరీక్షలు చేసి ఫలితాలు త్వరగా ఇవ్వాలి అని అన్నారు. ఫార్మసీ విభాగంలో అవసరమైన మందుల సరఫరాను నిల్వ ఉంచాలి. బ్లడ్ బ్యాంక్‌లో రక్తం సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. శానిటేషన్ , పేస్ట్ కంట్రోల్ విభాగం ఆసుపత్రి ప్రాంగణంలో శుభ్రత, దోమల నివారణ చర్యలను క్రమం తప్పకుండా నిర్వహించాలి. సమావేశంలో అన్ని విభాగాల హెచ్‌ఒడిలు పాల్గొని తమ తమ విభాగాలలో అమలు చేయాల్సిన చర్యలను వివరించారు. సీజనల్ వ్యాధుల కారణంగా వచ్చే కేసులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వైద్యశాల సిబ్బంది సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా జ్వరాలు మరియు ఇతర వ్యాధులపై తీసుకోవాల్సిన చర్యలపై ప్రతివారం అన్ని విభాగాల సమన్వయం చేసుకొని కొత్తగా వచ్చే వ్యాధులపై నివేదిక ఇవ్వాలని అడ్వైజర్ కమిటీని ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలు ఆసుపత్రిపై నమ్మకంతో వస్తారని, నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కోసం అన్ని విభాగాలు కృషి చేయాలి. రోగుల ఆరోగ్యం, ప్రాణభద్రత మన మొదటి ప్రాధాన్యం అన్నారు. ఇన్చార్జి సిఎస్ఆర్ఎంఒ, డాక్టర్ వెంకటరమణ డిప్యూటీ సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిఫల్, మైక్రో బయాలజీ హెచ్ఒడి డాక్టర్ రేణుకా దేవి, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్, డాక్టర్ లక్ష్మీబాయి, బయో కెమిస్ట్రీ హెచ్ఒడి డాక్టర్ కిరణ్మయి, ఎస్ పి ఎం డిపార్ట్మెంట్ హెచ్ఒడి డి డాక్టర్ సుధా కుమారి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివబాల, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కిరణ్ కుమార్, నర్సింగ్ సూపరిండెండెంట్ సావిత్రిబాయి తదితరులు పాల్గొన్నారు.

పెద్దటేకూరు లో బైక్ దొంగలు హల్ చల్

-బైక్ పోయిందన్నా స్పందించని పోలీసులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామంలో దొంగలు హల్ చల్ చేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చెస్తున్నారు. గత నెల 31న గుర్తు తెలియని వ్యక్తి ఎపి 40 బి ఎల్ 6994 నంబర్ కలిగిన ప్యాసన్ ప్లస్ బైకును తెచ్చి పెద్దటేకూరు లో శేఖర్ ఉన్న వీధిలో పార్కింగ్ చేసి వెళ్లిపోయాడు. ఈ బైక్ వెనకాల పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా అనిరాసి ఉంది. ఇంకా జనసేన పేరు పవన్ కళ్యాణ్ పేరు రాసిఉంది. తరువాత ఇంటి ముందున్న ఎపి 21 ఏ హెచ్ 1990 నంబర్ గల శేఖర్ బైకును ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని ఉలిందకొండ పోలీసులకు భాదితుడు ఫిర్యాదు చేశారు. ఇప్పటికి పోలీసులు స్పందించ లేదు. 10 రోజుల తరువాత మళ్ళీ బుధవారం రాత్రి ఇదే వీధిలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాల నుంచి దొంగతనంగా పెట్రోలు తీస్తున్నారు. ఈ సమయంలో అటుగా మనుషులు వస్తున్న అలికిడి కావడంతో దొంగలు పెట్రోలు బాటిల్ ను బండి పైనే వదిలి పారిపోయారు. ఈ సంఘటనను పోలీసులకు స్థానికులు తెలియజేసినా స్పందన లేదు.

దొంగతనాలను అరికట్టాలి: సి శేఖర్ పెద్దటేకూరు గ్రామం

గ్రామాల్లోకి దొంగలు వస్తూ బైక్ లను ఎత్తు కెళ్లుతున్నారు. వారి కంటికి ఏది కనిపిస్తే దాన్ని దొంగ్లిస్తున్నారు. ప్రజలకు రాత్రి సమయంలో నిద్ర లేకుండా చేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చెసినా స్పందన లేదు. భయం గుప్పిట్లో ప్రజలు ఉన్నారు.





జిజిహెచ్ లో నెఫ్రాలజీ విభాగంలో రెండు అత్యాధునిక డయాలసిస్ మిషన్లు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నెఫ్రాలజీ విభాగంలో రెండు అధునాతన డయాలసిస్ మిషిన్లను సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంత్రాలను ఏర్పాటు చేయడం ద్వారా మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్న పేషెంట్లకు మరింత సమర్థవంతమైన వైద్య సేవలు అందించడానికి అవకాశం కలుగుతుందని అన్నారు. రోజు రోజుకూ డయాలసిస్ అవసరమయ్యే రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కొత్తగా రెండు అధునాతన మిషిన్లను ఏర్పాటు చేయడం ద్వారా పేషెంట్లకు తక్షణ, నాణ్యమైన వైద్య సేవలు అందించగలుగుతున్నామని తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది ద్వారా సమన్వయంతో పేషెంట్లకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సేవలు అందించేలా చర్యలు తీసుకున్నామని, రాబోయే రోజుల్లో మరిన్ని సౌకర్యాలను సమకూర్చే దిశగా కృషి చేస్తామని అన్నారు. నెఫ్రాలజీ విభాగానికి అధునాతన వైద్య పరికరాలు అందించినందుకు డాక్టర్ కె వెంకటేశ్వర్లుకు నెఫ్రాలజీ విభాగపు వైద్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి ఇన్చార్జి సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, నెఫ్రాలజీ విభాగపు వైద్యులు, డాక్టర్ జిక్కి, డాక్టర్ అనంత్, డాక్టర్ వెంకటప్పకిర్ రెడ్డి, డాక్టర్ శ్రీధర్ శర్మ, నెఫ్రాలజీ విభాగం పీజీలు, నర్సింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కొత్త మిషన్లను ప్రారంభిస్తున్న డాక్టర్ జిక్కి

భక్త కనకదాసు విగ్రహాన్ని పగలగొట్టిన దుండగులను శిక్షించాలి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు జిల్లా ఆలూరు మండలం మన్నెకుర్తి గ్రామంలో కురువల ఆరాధ్య దైవమైన భక్త కనకదాసు విగ్రహం చెయ్యి విరుగొట్టి ధ్వంసం చేయడాన్ని కర్నూలు ఉమ్మడి జిల్లా గొర్రెల కాపరుల సొసైటీ జిల్లా చైర్మన్ కె ఎ. శ్రీనివాసులు ఖండించారు. ఆలూరు మండలం మన్నె కుర్తి గ్రామంలో కురువలు ఎంతో శ్రమించి కురవల ఆరాధ్య దైవమైన భక్త కనకదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారన్నారు. కురవల ఆరాధ్యదయమైన భక్త భక్త కనకదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడాన్ని ఓర్వలేక దుండగులు విగ్రహాన్ని చేయి విరగొట్టడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ఇది సరైన పద్ధతి కాదని ఇలా జరుగుతే కర్నూలు జిల్లాలో ప్రశాంతంగా ఉన్న గ్రామాలలో చిచ్చుపెట్టే విధంగా దుండగులు చేస్తున్నారని. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని ఎస్‌పితో విచారణ చేపట్టి ఎవరైతే ఈ ఘటనకు పాల్పడ్డారో వారిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

-పౌరుల సమస్యలకు సత్వరమే పరిష్కారం

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో పౌరుల సమస్యలను ప్రత్యక్షంగా విని, తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు శుక్రవారం 'ఓపెన్ ఫోరం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎస్‌బిఐ ఉద్యోగుల కాలనీ మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఈకార్యక్రమం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన ఎల్‌ఆర్‌ఎస్, నిర్మాణ అనుమతులు వంటి సేవలలో తలెత్తుతున్న ఇబ్బందులపై పౌరులు తమ సమస్యలను నేరుగా చెప్పవచ్చున్నారు. పౌరుల ఫిర్యాదులను వెంటనే నమోదు చేసి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశిస్తామని కమిషనర్ తెలిపారు. నగర ప్రజల నుండి అందిన సూచనలు, ఫిర్యాదులు మున్సిపల్ పాలనలో పారదర్శకత పెంచడమే కాకుండా వేగవంతమైన సేవలందించేందుకు తోడ్పడతాయని ఆయన వివరించారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

ప్రతి వీధి పరిశుభ్రంగా ఉంచాలి

-మైక్రో పాకెట్ల పరిధిలో పారిశుధ్య సిబ్బంది వివరాలు

-గార్బేజ్ పాయింట్లు లేకుండా చర్యలు కట్టుదిట్టం

నగరంలోని ప్రతి వీధి పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరపాలక కార్యాలయంలో పారిశుధ్య తనిఖీదారులతో సమావేశం నిర్వహించారు.



సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-పత్తికొండ

ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు గురువారం పత్తికొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కెఇ. శ్యాంకుమార్, నియోజకవర్గంలోని దాదాపు 21 మంది బాధితులకు అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.13,62000 మంజూరయ్యాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టకాలంలో కుటుంబానికి పెద్ద కొడుకుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా ఉంటున్నారని అన్నారు. లబ్ధి పొందిన బాధ్యులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సాంబశివరెడ్డి, రామనాయుడు, వెంకటపతి, తిమ్మయ్య చౌదరి, మండల కన్వీనర్ కడవల సుధాకర్, చెన్నం నాయుడు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కెఎంసిలో జనరల్ మెడిషన్ పిజి సీట్ల పెంపు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు మెడికల్ కాలేజీలో జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన పీజీ సీట్లు ప్రస్తుతం 20 ఉన్నాయని, అదనంగా 9 సీట్లను నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతి లభించిందని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెరిగిన సీట్లు ఈ విద్యా సంవత్సరం నుండే అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ సీట్ల కోసం ప్రత్యేకంగా జనరల్ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ శ్రీరాములును ప్రత్యేకంగా డిల్లీకి పంపి ప్రక్రియ పూర్తి చేయించామని తెలిపారు. ప్లాస్టిక్‌సర్జరీ, స్టేట్‌కేన్సర్ మొదలగు విభాగాల్లో అదనపు పిజి సీట్లకు ప్రతిపాదనలు పంపామని, వచ్చే సంవత్సరం ఆ విభాగాలలో సీట్లు కూడా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందనితెలిపారు. జనరల్ మెడిసిన్‌లో పిజి సీట్ల పెంపు ద్వారా అన్ని సాధారణ జబ్బులకు మరింత మంది పేద ప్రజలకు చికిత్స అందించుటకు అవకాశం వుందని తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి -కోడుమూరు

మండలంలోని గోరంట్ల గ్రామంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ ను గురువారం అధికారులు అదుపులో తీసుకొని సీజ్ చేశారు. గోరంట్ల గ్రామపంచాయతీ వారు వేసిన పైప్ లైన్ల దగ్గర హంద్రీ నదిలో నుండి అక్రమంగా ఇసుక ను ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లు తరలించుట వలన పైపు లైన్లు పగిలిపోతున్నాయి. గోరంట్ల గ్రామ విఆర్ఓ హంద్రీ నదిలో నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకునే ఉద్దేశంతో గురువారం ఉదయం 10 గంటలకు నదిలోకి వెళ్తున్న సమయంలో ఇసుక ట్రాక్టర్ ఇసుకల్లోడు చేసుకుని గ్రామంలోకి వస్తున్నప్పుడు ట్రాక్టర్‌ను ఆపారు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ అక్కడ నుండి పారిపోయాడు. ట్రాక్టర్ డ్రైవర్ పేరు విచారించగా అతని పేరు బోయ సూరి గా నిర్ధారించారు. అతడు గోరంట్ల గ్రామ నివాసి. ట్రాక్టర్ నంబర్ చూడగా ఎపి39 ఎన్‌క్యూ 8231 గాగుర్తించారు. గోరంట్ల గ్రామ విఆర్ఓ వై. పాండురంగయ్య ఇసుక ట్రాక్టర్లు పట్టుకొని కోడుమూరు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఫిర్యాదు మేరకు కోడుమూరు ఎస్ఐ డివై. స్వామి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

శని ఆదివారాల్లో మార్కెట్ యార్డ్ కు సెలవు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

శని,ఆదివారాల్లో కర్నూలు మార్కెట్ యార్డ్‌కు సెలవు ప్రకటించినందున జిల్లాలో ఉల్లి పండించిన రైతుకు తమ పంటను తాడేపల్లి గూడెం మార్కెట్ యార్డ్‌కు తరలించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ ఉల్లి పంటను తాడేపల్లి గూడెం మార్కెట్‌కు తీసుకుని వెళ్లేటపుడు ఆధార్, బ్యాంక్ పాస్ బుక్, ఈ క్రాప్ నమోదు ఒరిజినల్ సర్టిఫికెట్, పొలం పాసు పుస్తకం తీసుకువెళ్లాలని జాయింట్ కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. మే నుండి జూన్ 15వరకు ఉండి, పక్వానికి వచ్చిన ఉల్లి పంటను మాత్రమే కోయాలని జెసి సూచించారు. జులైలో వేసిన పంటను అక్టోబర్ వరకు వేచి ఉండి కోరాలని సూచించారు.

అన్ని కోర్టు ప్రాంగణాలలో జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి -కర్నూలు లీగల్ : జాతీయ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాలతో, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13 రెండో శనివారం కర్నూలు , నంద్యాల జిల్లాలలోని అన్ని న్యాయ స్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఉంటుందని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి. కబర్ధి , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. పెండింగులో ఉన్న, రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ , ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కరించకోవాలని సూచించారు. ఈ లోక్ అదాలత్‌ను పురష్కరించుకొని కర్నూలు జిల్లా కోర్టు ఆవరణంలో ఐదు బెంచీలు మిగతా మండలలో 15 బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు అందరూ ఉపయోగించుకోవాలని, తమ తమ కేసులను రాజీ పూర్వకంగా పరిష్కరించుకోవాలని కోరారు